
కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం సమర్పిస్తున్న దళిత సంఘాల నాయకులు

దళితబంధు లబ్ధిదారులకు న్యాయం చేయాలి

కులకచర్ల, జనవరి 10 : ఐదు నెలల క్రితం దళిత బంధు పథకానికి దరఖాస్తు చేసుకున్నామని, అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టు కింద దళితబంధు మంజూరు చేసిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం తమకు రావల్సిన దళితబంధు పథకం డబ్బులు ఇచ్చేలా చూడాలని కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. దళిత బంధు ద్వారా ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలు, ఉద్యమకారులు, జీవనోపాధికోసం ఎదురుచూస్తున్నారని తెలిపారు. దళితబంధు నిధులు మంజూరు చేయించి ఆదుకోవాలని కోరారు.

దళితబంధు నిధులు విడుదల చేయాలి

పరిగి టౌన్ : దళితబంధు నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం పరిగి మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన దళితబంధు లబ్దిదారులు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగిన ధర్నాలో పాల్గొన్నారు. ఎన్నికల కోడ్ ముందు లబ్ధిదారులను ఎంపిక చేశారని ఎన్నికల కోడ్‌తో నిధులు నిలిచిపోయాయని ఎన్నికల కోడ్ ముందు గుర్తించిన లబ్ధిదారుల ఖాతాలో నిధులను వెంటనే జమ చేయాలని లబ్ధిదారులు ప్రభుత్వాన్ని కోరారు.

విజేతలకు బహుమతులు అందజేస్తున్న కొండా విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు

పండుగలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక

షాబాద్, జనవరి 10 : పండుగలు సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని హాకీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, హోప్ ఫౌండేషన్ చైర్మన్ కొండా విజయ్‌కుమార్ అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్, హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో షాబాద్‌లోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ముగ్గులు వేసేందుకు విద్యార్థులు ఆసక్తి కనవర్చాలని సూచించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

పేదలకు మెరుగైన వైద్యానికి చర్యలు

- సర్కార్ దవాఖానల అభివృద్ధికి ఆమెజాన్ వెబ్ సర్వీస్ కృషి అభినందనీయం
- రంగారెడ్డిజిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు

అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, అమెజాన్ వెబ్ సర్వీస్ వైస్ ప్రెసిడెంట్ కెవిన్ మిల్లర్, ఎంపీపీ ప్రశాంతిరెడ్డి, సర్పంచ్ సుబ్రమణ్యేశ్వరి

షాబాద్, జనవరి 10 : ప్రభుత్వ దవాఖానల్లో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా చర్యలు చేపడుతున్నట్లు రంగారెడ్డి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్ రావు అన్నారు. షాబాద్‌లోని ప్రభుత్వ దవాఖానను ఆమెజాన్ వెబ్ సర్వీస్ ఆధ్వర్యంలో పునరుద్ధరించిన ఆరోగ్యకేంద్రాన్ని ఆమెజాన్ వెబ్ సర్వీస్ వైస్ ప్రెసిడెంట్ కెవిన్ మిల్లర్‌తో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ దవాఖానను అభివృద్ధి చేసేందుకు ఆమెజాన్ వెబ్ సర్వీస్ ముందుకు రావడం గొప్ప పరిణామమన్నారు. ఇప్పటికే చందనవెల్లి దవాఖానను అభివృద్ధి చేశారని, షాబాద్ దవాఖానను కూడా పునరుద్ధరించడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించేలా తాము చర్యలు తీసుకుంటున్నామన్నారు. షాబాద్ దవాఖానలో 24 గంటలు పాటు వైద్యసేవలు అందించేలా చూడాలని సర్పంచ్‌తో పాటు ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చారని, త్వరలో ఆ సమస్య పరిష్కరానికి కృషి చేస్తామని ఆయన తెలిపారు.

పునరుద్ధరణ పనులు చేపట్టాం

అమెజాన్ వెబ్ సర్వీస్ వైస్ ప్రెసిడెంట్ కెవిన్ మిల్లర్ మాట్లాడుతూ.. కమ్యూనిటీలపై సానుకూల ప్రభావం చూపడమే తాము లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. రంగారెడ్డిజిల్లాలోని నెదునూర్, మీర్‌ఖాన్‌పేట్, కందుకూరు, షాబాద్ తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల పునరుద్ధరణ చేపట్టామన్నారు. ఆరోగ్య సంరక్షణ కేంద్రం పునరుద్ధరణలో భాగంగా గదులన్నీ పూర్తిగా మార్చడంతో పాటు వెయిటింగ్ హాల్, మరుగుదొడ్లు, ఆరోగ్యకేంద్రానికి ఆనుకున్న స్థలంలో పార్కింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. భవనం దెబ్బతినకుండా వాటర్ ప్రూఫింగ్ చేశామన్నారు. కొత్త ఫర్నిచర్ అందించినట్లు చెప్పారు. అమెజాన్ వెబ్ సర్వీస్ ఇండియా సెర్చ్ సపోర్ట్‌తో ఈ కేంద్రం పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ దామోదర్, షాబాద్ ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డి, షాబాద్ సర్పంచ్ తమ్మలి సుబ్రమణ్యేశ్వరి, ఎంపీడీవో అనురాధ, సీహెచ్‌వో గోపాల్‌రెడ్డి, డాక్టర్ శ్రీనివాస్, సర్పంచులు కొలన్ ప్రభాకర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, చందిప్ప జంగయ్య, వెంకటేశ్, రవీందర్, ఎంపీటీసీలు అశోక్, కుమ్మరి చెన్నయ్య, అస్మత్‌పాషా, ఫార్మసిస్ట్ శంకర్, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వికారాబాద్‌ను అభివృద్ధి చేసుకుందాం

మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

వికారాబాద్, జనవరి 10: వికారాబాద్ పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల తెలిపారు. బుధవారం పట్టణంలోని ఒకటి, ఏడు, ఎనిమిది వార్డుల్లో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఆధ్వర్యంలో మున్సిపల్‌ను మరింత అభివృద్ధి చేసుకుందామని, ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించుకుందామన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో మున్సిపల్ పరిధిలోని ఒకటో వార్డులో వాటర్ పైప్ లైన్ పనులు, ఏడో వార్డులో యూజీడీ పనులు, ఎనిమిదో వార్డులలో వాటర్ పైప్ లైన్ పనులను చైర్‌పర్సన్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగుళ్లపల్లి రమేశ్ కుమార్, స్థానిక కౌన్సిలర్లు వేణుగోపాల్ రెడ్డి, గోపాల్, పరిగి సంతోషా నర్సింహులు, నాయకులు దీపు, సందీప్ పాల్గొన్నారు.


అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల

చెంచు కుటుంబాలతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో రామకృష్ణ

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

ఎంపీడీవో రామకృష్ణ

కడ్తాల్, జనవరి 10 : చెంచుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వినియోగించుకోవాలని ఎంపీడీవో రామకృష్ణ అన్నారు. బుధవారం మండల పరిధిలోని కర్కల్‌పహాడ్, వాసుదేవ్‌పూర్ గ్రామాల్లోని చెంచు కుటుంబాలతో అధికారులు సమావేశం నిర్వహించి, కేంద్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన జన్‌జాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్ పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చెంచు కాలనీలో వసతులు, సదుపాయాలు, ప్రభుత్వం నుంచి అందుతున్న పథకాలను గురించి అడిగి తెలుసుకున్నారు. పీఏం జన్‌మన్ పథకంలో చెంచులకు సురక్షిత మంచినీరు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆధార్‌కార్డు అప్‌డేట్, వృత్తి నైపుణ్య కేంద్రాలు, బ్యాంక్ ఖాతా, కుల సర్టిఫికెట్లు, ఎన్ఆర్ఈజీఎస్ జాబ్ కార్డులు తదితర సౌకర్యాలు కల్పించడానికి అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. చెంచు గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పించడానికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్నదని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ లచ్చిరాంనాయక్, తహసీల్దార్ ముంతాజ్, సీడీపీవో సక్కుబాయి, డీటీ వినోద్‌కుమార్, ఏపీఎం రాజేశ్వరి, సరళ, ఏవో శ్రీలత పాల్గొన్నారు.

పెరటి కోళ్ల పెంపకంపై రైతులు దృష్టి సారించాలి

రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి

షాబాద్, జనవరి 10 : రైతులు పెరటి కోళ్ల పెంపకంపై దృష్టి సారించాలని రేగడిదోస్వాడ పశువైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. రాజేంద్రనగర్ పీవీ నర్సింహారావు పశువైద్య కళాశాల నుంచి వందశాతం సబ్సిడీపై బుధవారం షాబాద్ మండలంలోని మద్దూర్ రాంసింగ్ తండా, హన్మనాయక్ తండా, పోతుగల్ తండాల్లో 140 మంది ఎస్టీ రైతులకు ఉచితంగా 20 చొప్పున పెరటి కోడిపిల్లలను పంపిణీ చేశారు. 10 కిలోల చొప్పున దాణా కూడా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఎస్టీ రైతులు పెరటి కోళ్ల పెంపకంపై దృష్టి సారించాలని, మంచి ఆదాయం ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు పెరటి కోడిపిల్లలను పంపిణీ చేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

ఆమనగల్లు ఎంపీపీ దంపతులపై దాడి

ఆమనగల్లు, జనవరి 10 : మండల పరిధిలోని మేడిగడ్డ తండాలో ఆమనగల్లు ఎంపీపీ నేనావత్ అనితావిజయ్‌కుమార్ దంపతులపై తండాకు చెందిన నేనావత్ రవీందర్‌నాయక్ దాడి చేసి గాయపరిచినట్లు ఎస్సై బలరాం తెలిపారు. ఎంపీపీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు వెల్లడిస్తున్నట్లు ఎస్సై తెలిపారు. బుధవారం మేడిగడ్డ తండా సమీపంలో ఏర్పాటు చేసిన మౌంట్ హ్యూ వెంచర్‌కు అనుమతులు ఉన్నాయా? లేదా అని తెలుసుకోవడానికి ఎంపీవో శ్రీలత, పంచాయతీ కార్యదర్శి వెంకటయ్యతో కలిసి ఎంపీపీ అనిత భర్తతో కలిసి అక్కడి వెళ్లారు. అదే సమయంలో వెంచర్‌లో పని చేస్తున్న నేనావత్ రవీందర్ ఎలాంటి కారణం లేకుండానే ఎంపీపీని అసభ్య పదజాలంతో తిడుతూ.. చేయి చేసుకున్నాడు. పక్కనే ఉన్న ఎంపీపీ భర్త అడ్డు వచ్చారు. దీంతో అక్కడే ఉన్న రాయిని తీసుకొని ఎంపీపీ భర్తపై తలపై బలంగా కొట్టడంతో గాయాలయ్యాయి. నిందితుడిపై చర్య తీసుకోవాలని ఎంపీపీ ఫిర్యాదు అందజేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న మేనేజర్ వినోద్‌కుమార్

రుణాలు సక్రమంగా చెల్లించేలా చూడాలి

కులకచర్ల, జనవరి 10 : మహిళా సంఘాల సభ్యులు రుణాలు సకాలంలో చెల్లించేలా సిబ్బంది కృషిచేయాలని కులకచర్ల స్టేట్ బ్యాంక్ మేనేజర్ వినోద్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ మదన్‌రెడ్డి అన్నారు. బుధవారం కులకచర్లలోని స్టేట్ బ్యాంకులో సీబీఆర్ఎం కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సకాలంలో రుణాలు చెల్లిస్తేనే కొత్త రుణాలు మంజూరు చేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సీసీలకు, వీవోఏలకు బ్యాంకు లావాదేవీల గురించి వివరించారు. కార్యక్రమంలో ఏపీఎం శోభ, సీసీలు, వీవోఏలు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ధారూరులో కూలీల కొరతతో నెలకొరిగిన తెల్ల బంగారం(పత్తి)

తెల్ల బంగారానికి కూలీల కొరత

- కూలీ రూ.300 నుంచి 350 వరకు డిమాండ్
- ఎకరాకు 7 నుంచి 8 క్వింటాళ్ల దిగుబడి, ఎకరాకు రూ.4వేల నుంచి 5 వేల పెట్టుబడి
- పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతుల ఆందోళన
- మండలంలో 12 వేల ఎకరాల్లో పత్తి సాగు

ధారూరు, జనవరి 10 : రైతులు సాగు చేసిన పత్తి పంటకు కూలీల కొరత ఏర్పడింది. మండల పరిధిలోని ఏడు క్లస్టర్లు ధారూరు, కెరెళ్లి, మామిన్‌కలాన్, మున్నూరుసోమారం, నాగారం, గురుదోట్ల, నాగసముందర్ గ్రామాల్లో సుమారు 12 వేల ఎకరాల్లో పత్తి సాగు చేశారు. నెల రోజుల క్రితం కురిసిన వర్షాలకు పత్తి పంటలు భారీగా దెబ్బతిని దిగుబడి తగ్గిపోయిందని రైతులు వాపోతున్నారు. దీనికి తోడు కూలీల కొరత ఏర్పడటంతో పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షాకాలం ముగిసినప్పటికీ ఎప్పుడు.. ఏ సందర్భంలో వర్షం కురుస్తుందో తెలువకుకుండా ఉందని, బయటపడ్డ పత్తిని తొలుచుకొని ఇండ్లకు తరలించుకుందామంటే కూలీలు దొరకడంలేదన్నారు. కూలీలు రూ.300 నుంచి 350 వరకు డిమాండ్ చేయడంతో పొలంలోనే పత్తి రాలిపోవడాన్ని చూసి కన్నీరు పెట్టుకునే పరిస్థితి ఏర్పడిందంటున్నారు. ఖరీఫ్ ప్రారంభంలో వర్షాలు సకాలంలో కురువడంతో ఆనందంగా పంటలు సాగు చేసుకున్నామని, ఆశించిన మేర పంట ఏపుగా పెరిగి ఆధిక దిగుబడులు అందుకోవచ్చనుకున్నట్లు రైతులు తెలిపారు. వర్షాలు భారీగా కురువడంతో పంట నీటిపాలైనట్లు ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో యాసంగి సాగు పనుల్లో రైతులు నిమగ్నమైపోవడంతో పత్తిని తీసేందుకు కూలీలు దొరకడంలేదని రైతులు తెలిపారు.

అదును చూసుకొని రేట్లు పెంచేశారు..

కూలీ సామాన్యంగా రూ.200 నుంచి రూ.250 ఉండగా.. ప్రస్తుతం అదును చూసుకొని కూలీ రూ.300 నుంచి రూ.350 వరకు డిమాండ్ చేస్తున్నట్లు రైతులు తెలిపారు. డిమాండ్ ప్రకారం కూలీ చెల్లించడంతోపాటు రవాణా సౌకర్యాలకు అదనంగా చెల్లించాల్సి వస్తున్నదని తెలిపారు. గత సంవత్సరం సీజన్‌లో పత్తి తీసేందుకు కిలోకు రూ.8 నుంచి 10 ఉండగా, ప్రస్తుతం కిలోకు రూ.10 నుంచి 12 వరకు చెల్లిస్తున్నట్లు తెలిపారు. వాణిజ్య పంటలపై రైతులు ఆసక్తిని పెంచుకోవడంతో ఈ ప్రాంతంలో చాలా వరకు పత్తి పంట సాగు పెరిగింది. పత్తి పంట సాగుకు ప్రతి ఎకరాకు రూ.5వేల నుంచి రూ.6వేల వరకు పెట్టుబడి పెట్టినట్లు తెలిపారు. గత సంవత్సరం ఎకరాకు 10 క్వింటాళ్ల నుంచి 12 క్వింటాళ్ల వరకు దిగుబడి రాగా, ఈ సంవత్సరం ఎకరాకు 7 క్వింటాళ్ల నుంచి 8 క్వింటాళ్లకు దిగుబడి పడిపోయిందని, పెట్టిన పెట్టుబడి కూడా చేతికి అందే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కూలీలతో ఇబ్బంది ఉంది

పెట్టుబడి పెట్టి సాగు చేసుకున్న పంటలు చేతికందేసరికి కూలీల కొరత ఏర్పడింది. పండించిన పంటకు దిగుబడి వస్తుందో లేదో కానీ కూలీలకు మాత్రం అధికంగా డబ్బులు చెల్లించాల్సి వస్తున్నది. రోజు కూలీ అయితే రూ.300 నుంచి 350 వరకు ఉందని, కిలో లెక్క అయితే రూ.10 నుంచి 12 వరకు చెల్లించాల్సి వస్తున్నది. గత సంవత్సరం అయితే కిలో రూ.8 నుంచి 10 వరకు ఇచ్చేది. గత సంవత్సరం ఎకరాకు 10 క్వింటాళ్ల నుంచి 12 క్వింటాళ్లు దిగుబడి రాగా.. ఈ సంవత్సరం 7 క్వింటాళ్ల నుంచి 8 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది.

- హరీశ్‌రావు, రైతు, మామిన్‌కలాన్, ధారూరు మండలం

తప్పులు లేకుండా నమోదు చేయాలి

మర్పల్లి : ప్రజాపాలన దరఖాస్తు వివరాలు తప్పులు దొర్లకుండా వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని డీఎల్‌పీవో అనిత అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తులు అన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 27 గ్రామ పంచాయతీలకు సంబంధించి వచ్చిన ప్రజాపాలన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి నమోదు చేయాలన్నారు. ఏదైనా సందేహం ఉంటే సంబంధిత అధికారులను అడిగి తెలుసుకోవాలన్నారు.. కార్యక్రమంలో తహసీల్దార్ గణేశ్, ఎంపీడీవో రాజమల్లయ్య పాల్గొన్నారు.

ప్రైవేట్ క్లినిక్‌పై అధికారుల దాడి

ఆదిబట్ల, జనవరి 10 : నిషేధిత మందులను విక్రయిస్తున్న ఓ ప్రైవేట్ క్లినిక్‌పై డ్రగ్స్ కంట్రోల్ అధికారులు దాడి చేశారు. రూ.లక్ష విలువ చేసే నిషేధిత మందులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన బుధవారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని ఎంపీపటేల్‌గూడలో జరిగింది. ఈ సందర్భంగా డ్రగ్స్ కంట్రోల్ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ అంజుమ్‌అబిదా మాట్లాడుతూ.. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని ఎంపీపటేల్‌గూడలో ఎలాంటి అర్హత లేకున్నా హనుమంతరావు అనే వ్యక్తి క్వాక్స్ క్లినిక్ నడుపుతూ ప్రభుత్వం నిషేధించిన మందులను విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేశామన్నారు. క్లినిక్‌లో రూ.లక్ష విలువ చేసే 87 రకాల మందులను గుర్తించామన్నారు. వాటిని స్వాధీనం చేసుకున్నామన్నారు. త్వరలోనే హనుమంత్‌రావుపై చర్యలు తీసుకుంటామన్నారు. దాడిలో డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

యాదవ సంఘం బలోపేతానికి కృషి

కొడంగల్, జనవరి 10: యాదవ సంఘం బలోపేతానికి తన వంతు కృషి ఉంటుందని నూతనంగా ఎన్నికైన అఖిల భారత యాదవ మహాసభ జిల్లా కార్యదర్శి అంజనేయులు తెలిపారు. బుధవారం పరిగిలో జరిగిన యాదవ సంఘం సమావేశంలో కొడంగల్ మండలంలోని హస్నాబాద్ గ్రామానికి చెందిన ఆంజనేయులు మహాసభ జిల్లా కార్యదర్శిగా ఎన్నికయ్యారు.

వేగంగా దరఖాస్తుల నమోదు

ధారూరు, జనవరి 10 : ప్రజాపాలన కార్యక్రమంలో భాగంగా అభయ హస్తం కార్యక్రమానికి వచ్చిన దరఖాస్తులను అన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు మండల ప్రత్యేక అధికారి మల్లేశం తెలిపారు. మల్లేశం నమోదు కార్యక్రమాన్ని ఎంపీడీవో చెన్నారెడ్డి, ఎంపీవో షఫీఉల్లాలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మల్లేశం మాట్లాడుతూ.. గత వారంలో అభయ హస్తం కార్యక్రమానికి 12,728 మంది దరఖాస్తులు చేసుకోగా అందులో 8,659 దరఖాస్తులు అన్‌లైన్‌లో ఇప్పటివరకు పూర్తి చేసినట్లు తెలిపారు.

వృద్ధులకు వాకింగ్ స్టిక్స్‌ను అందజేసిన యజ్ఞం ఫౌండేషన్ సభ్యులు

వృద్ధులకు వాకింగ్ స్టిక్స్ అందజేత

వికారాబాద్, జనవరి 10 : ధన్నారంలోని స్వామి వివేకానంద గురుకుల్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్స్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులు 12 గ్రామాల్లో వృద్ధుల అవసరాలు సర్వే చేసి తెలుసుకున్నారు. గురుకుల పిల్లలు వాస్తవ ఆరోగ్య స్థితిని అంచనా వేయడానికి ప్రశ్నావళిని అడిగారు. కుటుంబం మద్దతు ఇస్తుందా లేదా, ఆహారం, మందులు తదితర వాటిపై వివరాలు తెలుసుకున్నారు. వృద్ధులందరికీ పండ్లు పంపిణీ చేయడంతోపాటు సుమారు 300 వాకింగ్ స్టిక్స్ నిరుపేద వృద్ధులకు అందజేశారు. ధన్నారం వార్డు నంబర్-2లో మున్సిపల్ కౌన్సిలర్ రాములు పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

నవాబుపేట, జనవరి10: మూడు నెలలకు ఒక్కసారి నిర్వహించుకునే మండల సాధారణ సర్వసభ్య సమావేశం గురువారం ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సుమిత్రమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు నిర్ణీత సమయానికి హాజరు కావాలని కోరారు.

సేంద్రియ సాగు.. దిగుబడులు బాగు

- రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి
- క్రిమి సంహారక మందులతో క్షీణిస్తున్న భూసారం
- యాజమాన్య పద్ధతులు పాటించాలి
- వ్యవసాయ శాఖ నిపుణుల సూచనలు

రైతు అంజయ్య వ్యవసాయ క్షేత్రంలో తయారు చేసిన సేంద్రియ ఎరువు

వరిపంటకు రసాయన ఎరువులను పిచికారీ చేస్తున్న రైతు

ఇబ్రహీంపట్నం, జనవరి 10 : రైతులు పంటల సాగులో సేంద్రియ ఎరువుల వాడకం ద్వారానే అధిక దిగుబడులు సాధించవచ్చని పలువురు వ్యవసాయ శాఖ నిపుణులు సూచిస్తున్నారు. నేడు రైతులు సేంద్రియ ఎరువుల వాడకం తగ్గించి రసాయన ఎరువులపై దృష్టి సారించడంతో మానవులతో పాటు మూగజీవాలు కూడా ఈ ఆహారాన్ని తిని అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఎక్కువగా ఉందని తెలియజేస్తున్నారు. రైతులు వ్యవసాయాధికారుల సలహాలు, సూచనల మేరకు రసాయన ఎరువులను పూర్తిగా మరిచిపోయి సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి సారిస్తే ఎంతో మేలు కలుగుతుందని పలువురు అధికారులు సూచిస్తున్నారు. నేడు విచ్చలవిడిగా వెలసిన ప్రైవేట్ రసాయన ఎరువుల దుకాణాల యజమానులను ఆశ్రయించి రైతులు వారు ఇచ్చిన మందులను ఇష్టానుసారంగా పిచికారీ చేస్తున్నారు. దీంతో భూసారం తగ్గే ప్రమాదం పొంచి ఉండడంతో రైతులందరూ సేంద్రియ ఎరువులను అధికంగా వాడాలని సూచిస్తున్నారు.

రసాయన ఎరువుల వాడకంతో..

రసాయన ఎరువుల వాడకంతో వాటి అవశేషాలు బియ్యపు గింజల్లో దాగి ఉంటున్నాయి. వాటిని తినడంతో కిడ్నీ, జీర్ణ వ్యవస్థలపై ప్రభావం పడుతున్నది. పొలం ఒడ్డు వరాలపై పెరిగిన పచ్చ గడ్డి కూడా విషపూరితమవుతుండడంతో ఆ గడ్డిని మేయడంతో మూగజీవాలు కూడా అనారోగ్యానికి గురవుతున్నాయి. పంటల సాగులో వివిధ రకాల చీడపీడలను నివారించేందుకు మోనోక్రోజోఫాస్, ట్రైకోడెర్మా విరిడే, ట్రైక్లోరోపాస్ తదితర అతి ప్రమాదకరమైన పురుగు మందులను వాడడంతో భూసారం పూర్తిగా తగ్గిపోతుంది. రైతులు పంట కోసిన వెంటనే దుక్కులు దున్ని సేంద్రియ ఎరువులను వేయాలి. తిరిగి దుక్కులు దున్నించడం ద్వారా అనంతరం వేసే పంటలకు మంచి దిగుబడి వచ్చే అవకాశమున్నది. నేడు రైతులు పంటలు సాగుచేసిన తర్వాత పంటలకు సోకిన చీడపీడలను నివారించేందుకు ఇష్టానుసారంగా రసాయన ఎరువులు వాడడంతో భూములు కోతకు గురవుతున్నాయి. ఆయా ప్రాంతాల రైతులకు ఈ విషయమై పూర్తిగా అవగాహన లేకపోవడంతో విచ్చలవిడిగా రసాయన ఎరువులు వినియోగిస్తున్నారు. రసాయ ఎరువుల వినియోగాన్ని తగ్గించడానికి వ్యవసాయాధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నా ప్రయోజనం కనిపించడం లేదు. రసాయన ఎరువుల స్థానంలో వర్మీ కంపోస్టు, ఆవుపేడ, కోడి ఎరువుతో పాటు ఇతర సేంద్రియ ఎరువులతో పాటు కషాయాలను వినియోగించాలని వ్యవసాయ శాఖ నిపుణులు సూచిస్తున్నారు.

సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి సారించాలి

భూసార పరిరక్షణ విషయంలో రైతులు దృష్టి సారించాలి. రసాయన ఎరువులు, పురుగుల మందులను మోతాదుకు మించి వాడరాదు. రసాయనిక ఎరువులను అధికంగా వినియోగించడంతో మానవుడి ఆరోగ్యంతోపాటు భూసారం దెబ్బతింటుంది. తెగుళ్లు మరింత ఎక్కువ అవుతాయి. పచ్చిరొట్టతో పాటు ఇతర సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి సారించాలి. రైతులు తప్పనిసరిగా గ్రామాల్లో పర్యటిస్తున్న వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలి. భూసారం తెలుసుకునేందుకు రైతులు తప్పనిసరిగా మట్టి పరీక్షలు చేయించుకుంటే అధిక దిగుబడులు సాధించవచ్చు.

- శ్రవణ్, ఏఈవో, ఇబ్రహీంపట్నం